కాలువలుగా మారిపోతున్న గెడ్డలు

- జాతీయ రహదారిని ఆనుకుని అన్నిచోట్ల ఇదే దుస్థితి
- మారికవలస సమీపంలో ఎక్కువగా ఆక్రమణలు



గెడ్డని ఆక్రమించి హైవేని కలుపుతూ నిర్మించిన రోడ్డు



మారికవలస వద్ద గెడ్డ పైనుంచి ఏర్పాటు చేసిన రోడ్డు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడలో కొందరు వ్యక్తుల స్వార్థం ముందు గెడ్డలు బక్కచిక్కిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఆక్రమించడానికి, వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడానికి ఏదీ అనర్హం కాదన్నట్టు కొందరు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మారికవలస నుంచి పరదేశిపాలెం వరకు రోడ్డును ఆనుకుని 30 అడుగుల వరకు వెడల్పు గల భూమిని గెడ్డలుగా వినియోగించేందుకు ప్రభుత్వం చాలా చోట్ల విడిచిపెట్టింది. లక్షలాది నివాసాలు, పలు చెరువుల నుంచి వచ్చిన నీరు వీటి ద్వారానే ప్రధాన గెడ్డలు ద్వారా బంగాళాఖాతం వైపునకు వర్షం, వాడుక నీటిని తీసుకెళ్తాయి. వీటికి అనుసంధానంగా మారికవలస, బోరవానిపాలెం, పరదేశిపాలెం, డ్రైవర్స్ కాలనీ, మధురవాడ, నగరంపాలెం, రేవళ్లపాలెం తదితర ప్రాంతాల్లో పలు చిన్న గెడ్డలున్నాయి. ఇవి కాలనీలు, చెరువులు, కొండల నుంచి వచ్చిన నీటిని భారీ గెడ్డలకు కలుపుతాయి.

చిన్న పైపులు వేసి పూడ్చేసి...

ముఖ్యంగా జాతీయ రహదారితోపాటు, పెద్ద పెద్ద రోడ్లకు అనుసంధానంగా 15 నుంచి 25 అడుగుల వెడల్పుతో ఉన్న గెడ్డలులో చాలా చోట్ల ఐదారు అడుగులు, అంత కంటే తక్కువ వెడల్పు ఉన్న పైపులు వేసి పూడ్చేస్తున్నారు. మరికొందరు గెడ్డలు, కాలువలపైనే బడ్డీలు, దుకాణాలు ఏర్పాటుచేసి భారీగా అద్దెలు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల వీటిపై శాశ్వతంగా రోడ్లు కూడా వేసేస్తున్నారు. ఈ ఇబ్బంది మారికవలస జంక్షన్ నుంచి పరదేశిపాలెం మధ్య, నగరంపాలెం రోడ్డులో మరీ ఎక్కువగా ఉంది. ఫలితంగా పెద్ద గెడ్డలన్నీ కాలువలుగా మారిపోతున్నాయి. దీంతో వర్షం నీరు సులువుగా ముందుకు వెళ్లక, చిన్నపాటి వర్షానికే కాలనీలు, రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి పూడికలు తీయిస్తున్నా ఎప్పటికప్పుడు స్వార్థంతో కొందరు పూడ్చేస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై జోన్ - 2 టీపీవో వరప్రసాద్ మాట్లాడుతూ భారీ వెడల్పుతో ఉన్న గెడ్డల్లో చిన్నపాటి గొట్టాలు వేసి పూడ్చివేయడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల పూడిక తీయడానికి పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే వీటిని తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

కుంతీమాధవునికి వైభవంగా లక్ష తులసి పూజ



తులసి దళాలతో కుంతీమాధవ స్వామి



కలశాలతో నీరు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు, ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో లక్ష తులసి పూజ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున కుంతీ మాధవ స్వామిని అర్చక స్వాములు సుప్రభాత సేవతో మేల్కొలిపారు. తదుపరి ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భక్తులు గోస్తనీ నది నుంచి కలశాలతో తీసుకొచ్చిన జలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. తదుపరి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష తులసి పూజ జరిపారు. తులసి దళాలతో కుంతీ మాధవ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గేదెల చంద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఆపస్‌కు సభ్యత్వంపై హర్షం

పద్మనాభం: ఉద్యోగ ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) స్టీరింగ్ కమిటీలో తమ సంఘానికి సభ్యత్వం కల్పిస్తూ జనరల్ అడ్మినిస్ట్రేటివ్ (సర్వీసెస్ వెల్ఫేర్) డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు కాళ్ల గోపీనాథ్, పద్మనాభం మండల శాఖ అధ్యక్షుడు కంటుబోతు మురళి హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఆరోగ్య పథకం అమలు తీరును సమీక్షించేందుకు తమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

తిమ్మాపురంలో షూటింగ్ సందడి



లొకేషన్‌లో నటుడు సప్తగిరి

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సప్తగిరి, శత్రు హీరోలుగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ ఓ రిసార్ట్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రానికి పి.సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదని, మరో మూడు రోజులు బీచ్ రోడ్డు ప్రాంతంలో షూటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత



ఆట వస్తువులు అందజేస్తున్న దుర్గా ప్రసాద్, పార్వతి

ఆనందపురం : మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాలకు దాతలు బుధవారం క్రీడా సామగ్రి అందజేశారు. మారికవలస గ్రామానికి చెందిన ఓలేటి దుర్గ ప్రసాద్, పార్వతి దంపతులు పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థం వివిధ క్రీడా పరికరాలను హెచ్‌ఎం యూవీవీ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో పరికరాలు అందజేశామని చెప్పారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు



డైరెక్టర్ వీకే చౌదరిని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: దేశ రక్షణ, ఆర్థిక రంగాల్లో సమాచార భద్రతకు ఉపకరించే క్వాంటమ్ కంప్యూటింగ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో కలకత్తా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ వీకే చౌదరి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో గీతం డీన్ సి.విజయ్ శేఖర్, ప్రొఫెసర్ ఆర్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల రక్తదానం



దాకమర్రి రఘు విద్యాసంస్థలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు విద్యా సంస్థలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, కరస్పాండెంట్ రమాదేవి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, సత్యనారాయణ, జగదీష్ పండా, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రాజీవ్, విహారి, జీవై నాయుడు, బీవీవీ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ప్రతినిధులు వెంకటరెడ్డి, రాజేష్, కృష్ణకిషోర్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా తుది ఓటర్ల జాబితా



సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, నాయకులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తున్నామని ఆర్డీవో, నియోజక వర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల ఇంటింటికీ బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు నమోదు చేశారని, ఆ వివరాలతో తుది జాబితా రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు దూరమవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ దూరంగా ఉన్న పోలింగ్ బూత్‌లను అందరికీ అందుబాటులో ఉండేలా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, జి.మధునాయుడు, రోశిరెడ్డి, యలమంచిలి సూర్యనారాయణ, కోరాడ రాజబాబు, కంటుభుక్త సునీత పాల్గొన్నారు.

ఇంటింటా మట్టి సేకరణ



ఆదర్శనగర్‌లో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస: మన మట్టి - మన దేశం కార్యక్రమంలో భాగంగా బీజేపీ భీమిలి నాయకులు జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో ఇంటింటా బుధవారం మట్టి సేకరించారు. పార్టీ తగరపువలస మండల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి 15 వరకు దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో మట్టి సేకరిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలోని స్వాతంత్ర్య సమరయోధుల పేరిట ఏర్పాటు చేయనున్న ఉద్యానవనానికి మట్టి తరలిస్తారన్నారు. నాయకులు కురుమెళ్ల కవిత, అయినాడ మాధవ, చిల్ల త్రినాథరెడ్డి, పంపాన సుబ్రహ్మణ్యం, శీరపు వెంకటరెడ్డి, గుజ్జు నర్సాబాయి, శీరపు ధరణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు

ఆనందపురం : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. పాఠశాలలతోపాటు క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇటీవల ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించిందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మొదటి రోజు బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల నుంచి 220 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ చందక అప్పలనాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వైఏఆర్‌కే ప్రసాద్, నాయకులు చందక సూరిబాబు, షిణగం రామారావు, చిన్నారావు, కొట్యాడ రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం భీమిలి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా 30 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తగరతి చదువుతున్న 350 మంది విద్యార్థినులు, ఆయా విద్యాసంస్థల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా పోటీలను ఎంఈవో శివరాణి, ప్రధానోపాధ్యాయుడు పి.మురళీమోహన్‌రావు, స్కూల్ గేమ్స్ మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో శివరాణి మాట్లాడుతూ ఆటల పోటీలు కారణంగా స్నేహ భావం వెల్లివిరుస్తుందన్నారు. వీరికి పోటీలను స్థానిక బాలుర హైస్కూల్‌తోపాటు బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. గురువారం బాలురకు, శుక్రవారం బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీతో నూతనోత్సాహం



లక్ష్మీపురంలో నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు



ఆదర్శనగర్ సచివాలయంలో కొత్త పెన్షన్లు పొందిన లబ్ధిదారులతో శిల్లా కరుణాకరరెడ్డి, తదితరులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్, మండల పరిధిలో కొత్తగా మంజూరైన సామాజిక పెన్షన్లను లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల సిబ్బంది బుధవారం ఉత్సాహకర వాతావరణంలో పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో ముందున్నారని పలువురు కొనియాడారు. వచ్చే ఏడాది రూ.250 పెంచి రూ.3వేలు వంతున అందించనున్నారని హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం పంచాయతీలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, గాడు తాతినాయుడు, కరుభుక్త వెంకటరమణ, జోగినాయుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

- భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేటలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి తదితరులు కొత్తగా మంజూరైన 10 పెన్షన్లు పంపిణీ చేశారు. ఆదర్శనగర్ సచివాలయంలో ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పీతల వెంకట అప్పారావు, జగన్నాథ ఎల్లాజీ, శిల్లా వంశీ తదితరులు కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. సంతపేటలో చిప్పాడ వెంకటేష్, నీలాపు సురేష్‌రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, గుజ్జు రాము, దుర్రి వెంకటలక్ష్మి తదితరులు కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు.



చిల్లపేటలో కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తున్న చిల్ల భాస్కరరెడ్డి, తదితరులు

భీమునిపట్నం: కొత్తగా మంజూరైన 20 మందికి వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నూకాలమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు పింఛన్ల నగదు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు.

కొత్తగా 430 పింఛన్లు మంజూరు

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లో గల లబ్ధిదారులకు 430 వివిధ రకాల కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో అడపా లవరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. వేములవలస సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, తర్లువాడలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కొత్త వాటితో కలిపి మండలంలో పింఛనుదారుల సంఖ్య 8,691కు చేరింది.

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులోని నగరంపాలెం సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. తమ్మినేని వరలక్ష్మి, సచివాలయ అడ్మిన్ అమూల్య, సంధ్య, మల్లేశ్వరి, సంతోషి, కీర్తన, జ్యోత్స్న, శ్యామల, లావణ్య పాల్గొన్నారు.



వేములవలసలో పింఛను నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు



నగరంపాలెం వార్డు సచివాలయంలో పింఛన్ నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



గణేష్‌నగర్‌లో ఉత్సవ రాట వేస్తున్న భక్తులు



ఆలయంలో విజయ గణపతి స్వామి

మధురవాడ: మధురవాడ గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 18 నుంచి 27 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 18న ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం చేస్తామన్నారు. 9 రోజులపాటు వివిధ రూపాల్లో అలంకరించి పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. పూజలు, హోమాల్లో పాల్గొనదలచిన భక్తులు ఆలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ప్రధాన అర్చకులు పద్మనాభ శర్మ, నవీన్ శర్మను సంప్రదించాలని సూచించారు. అలాగే ఈ నెల 29న ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

పద్మనాభం: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభారాణి అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా అందరూ కిచెన్ గార్డెన్, పెరటి కోళ్లు, న్యూట్రిసన్ గార్డెన్ పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా పెరట్లో కూరగాయలు పెంచుకునేందుకు విత్తనాలు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం నార్త్ కోస్టల్ రీజినల్ అధికారులు ప్రకాష్, హేమ సుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నేలతల్లి ఆరోగ్యంతోపాటు మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏరియా కో - ఆర్డినేటర్ సత్యంనాయుడు, ఏపీఎం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, సీడ్ మొబైల్ ఆధ్వర్యంలో బుధవారం చిట్టివలస, బోని గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. నిర్దేశిత వర్గాలకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతంగా నిర్వహించాలి

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శిబిరాల నిర్వహణకు 15 రోజుల ముందే ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలని సూచించారు. ఎంపీడీవో అడపా లవరాజు మాట్లాడుతూ సర్వే తేదీలు, శిబిరాల నిర్వహణ సమాచారం ముందుగానే అందజేస్తామని చెప్పారు. సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ పార్వతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూరంపూడి సుబ్బారావు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. భీమిలి నుంచి తగరపువలస వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్షతగాత్రుని భీమిలి వైపు స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటో ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుబ్బారావు తల, ముక్కు నుంచి తీవ్రంగా రక్తస్రావం కావడంతో ఆస్పత్రికి తరలించారు. సుబ్బారావు స్నేహితుడు మంచిగంటి గంగాధరరావు ఫిర్యాదు మేరకు భీమిలి హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణపేటలో కుక్కల బెడద



సత్యనారాయణపేటలో ఇళ్ల మధ్య తిష్టవేసిన కుక్కలు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో వీధి కుక్కలు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇళ్ల ముందు, వీధిలో తిష్టవేసి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని వెంటాడుతున్నాయి. రాత్రి వేళ అరిచి గోల చేసి స్థానికులకు నిద్రాభంగం కలిగిస్తున్నాయి. వీధుల్లో నుంచి తరిమినా మళ్లీ మళ్లీ అక్కడకే వచ్చి చేరుతున్నాయి. పలువురు వీటి బారినపడి గాయాల పాలవుతున్నారు. ఈ గ్రామానికి ఆనుకుని ప్రైవేట్ మార్కెట్ ఉండటంతో అక్కడి మాంస వ్యర్థాల కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా కుక్కలు వచ్చి ఇక్కడ చేరుతున్నాయి. జీవీఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో కుక్కలను గ్రామానికి దూరంగా తరలించడమో, నియంత్రించడమో చేసి తమకు రక్షణ కల్పించాలని సత్యనారాయణపేట వాసులు కోరుతున్నారు.